

వైభవం.. చిన వెంకన్న కల్యాణం



శ్రీవారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సర్వాభరణ భూషితుడై.. పెండ్లి కుమారుడిగా సర్వజగద్రక్షకుడైన శ్రీ వారు.. బుగ్గన చుక్కలతో సిగ్గులొలుకుతున్న అలివేలుమంగ, ఆండాళ్ దేవేరులను పరిణయమాడారు. ఈ కల్యాణ ఘడియలో స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని వీక్షించి భక్తులు తరించారు. ఈ అద్భుత దృశ్యం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఆవిష్కృతమైంది. తొలుత రాత్రి తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి అలంకరించి ఆలయ అనివేటి మండపంలో ఏర్పాటు చేసిన వేదిక దగ్గరకు తీసుకొచ్చి అక్కడ బంగారు సింహాసనంపై కల్యాణమూర్తులను ఉంచి అర్చకులు కల్యాణ తంతును ప్రారంభించారు. పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిగిన ఈ కల్యాణ తంతులో ఆలయ అర్చకులు ముందుగా శాంతి హోమాన్ని జరిపి సర్వదేవతారాధన, సంకల్పం, కంకణ పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ప్రభుత్వం తరపున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందించారు. ఆ తర్వాత అర్చకులు మూర్తులకు మధుపర్కాలను సమర్పించారు. సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాంగల్య ధారణ, తలంబ్రాలు వైభవోపేతంగా జరిపించారు. ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి కల్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఈఈ భాస్కర్ పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న చైర్మన్ సుధాకరరావు, ఎమ్మెల్యే మద్దిపాటి, ట్రస్టీ నివృతరావు



జనసేనలో చేరుతున్న ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

వైసీపీకి భారీ షాక్

- ఏలూరు రూరల్ ఎంపీపీ సహా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రాజీనామా.. జనసేనలో చేరిక

ఏలూరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఏలూరు రూరల్ మండలంలో వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. పార్టీకి చెందిన ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజుతోపాటు మొండికోడు, పెదయాగనమిల్లి, కలకుర్రుకు చెందిన సర్పంచ్‌లు గోపాలకృష్ణంరాజు, బి.సులోచన, భలే ప్రసాద్, మాదేపల్లి ఉప సర్పంచ్ నరహరిశెట్టి రాధాకృష్ణ, ఎంపీటీసీలు కాకర్ల తంబి, భలే స్వాతి, నరహరిశెట్టి రాధ, దెందులూరు జనసేన ఇన్‌చార్జ్ ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చాటపర్రులో గురువారం పార్టీలో చేరారు. ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, ఉమ్మడి పశ్చిమ జనసేన అధ్యక్షులు కొటికలపూడి గోవిందరాజు, ఏలూరు ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

జనవరి నుంచి కొత్త పింఛన్లు

రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లకు శ్రీకారం చుట్టనుంది. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు భరోసాగా నిలిచేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం అవ్వా తాతలకు పింఛన్‌ను పెంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చింది. ప్రతీ నెల ఒకటి, రెండు తేదీల్లో ఇంటింటికి ఈ మొత్తాలను అందించింది. ఇప్పుడు నవంబర్ నుంచి అర్హులైన కొత్త పింఛనుదారులను ఎంపిక చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వీరికి జనవరి నుంచి అందించనుంది. ఏడాదిగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి భరోసా లభిస్తుంది.

- వైసీపీ నిర్వాకంతో 16 నెలలుగా కొత్త అర్హులకు అందని పింఛన్లు
- నవంబరు నుంచి ఎంపిక చేసి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం



భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్ల మంజూరులో గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన మెలికతో 16 నెలలుగా అర్హులైన వృద్ధులు, వితంతువులకు పింఛన్‌లు అందుకోలేకపోయారు. ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు ఇస్తామన్నారు. గత ఏడాది జూన్‌లో ఇచ్చారు. మళ్లీ ఈ ఏడాది జనవరిలో ఇవ్వాలి. అలా ఇవ్వకుండా దరఖాస్తు యాప్‌ను క్లోజ్ చేశారు. అప్పటి వరకు జిల్లాలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న 4,200 మందికి పింఛన్‌లు అందలేదు. తర్వాత సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల కోడ్ వచ్చింది. వైసీపీ ఓటమి పాలైంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. అప్పటిలో దరఖాస్తు చేసుకునే యాప్ క్లోజ్ చేయడం వల్ల ఏడాదిగా అర్హులైన పింఛన్‌దారులు దరఖాస్తు చేసుకునే వీలు లేకపోయింది. దరఖాస్తు చేసుకునే అవకాశం వస్తే జిల్లాలో ఇప్పుడు మరో ఐదు వేల మందికి పైగా అర్హులు పెరుగుతారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో కలిపి మొత్తం తొమ్మిది వేల మందికిపైగా పింఛన్లు పొందే అవకాశం వుంది.

రూ.38 కోట్లు అదనం..

పింఛన్ల పెంపుదల ప్రభుత్వానికి భారమైనప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడే మాట నిలబెట్టుకుంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లాలో లక్షా 32 వేల మంది పింఛనుదారులకు రూ.59 కోట్లు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు లక్షా 31 వేల పింఛనుదారులకు రూ.97 కోట్లు ఇచ్చారు. పింఛన్ పెంపుతో నెలకు జిల్లాలో ప్రభుత్వంపై రూ.38 కోట్ల భారం పడింది. వచ్చే జనవరి నుంచి కొత్త పింఛన్లు వస్తే ఈ సొమ్ము మరింత పెరుగుతుంది.

అప్పుడు అనర్హులకు పింఛన్లు

తాము నడవలేని స్థితిలో వున్నామని చెప్పి కొందరు వికలాంగ పింఛన్లు పొందుతున్నారని ఇప్పటికే టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణ జరిపించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలా ఎంత మంది అనర్హులు పింఛన్లు పొందారు ? మంచం పట్టిన వికలాంగులు ఎందరు ? అనే అంశంపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తోంది.



ఎమ్మెల్యే పితానికి చెప్పినా ఫలితం లేదు

పెనుగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 'పెనుగొండ సీతారామపేటలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం షాపు తొలగించాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఈ రోజు దుకాణం ప్రారంభించారు' అంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తమ సమస్యను తహసీల్దార్ బి.అనితకుమారికి వివరించారు. సీపీఎం నాయకుడు షేక్ పాదుషా, పిల్లి గంగ, అక్కవరపు రమావతి, మంగ, లక్ష్మి పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతి

ఆచంట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం వల్లూరులో నూతన మద్యం షాపును జనావాసాలకు దూరంగా పెట్టే ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు కలెక్టర్ నాగరాణికి వినతి పత్రం సమర్పించారు.

కొత్త రేషన్ కార్డులొస్తున్నాయి

- జగన్ ఫొటో స్థానంలో రాజముద్రతో..
- పంపిణీకి సన్నాహాలు

నరసాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):తెల్ల కార్డులు త్వరలో రూపు మారబోతున్నాయి. జగన్, రాజశేఖరరెడ్డిల ఫొటోల స్థానంలో రాజ ముద్రలతో వున్న కొత్త కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల వారీగా కార్డుల వివరాలు సేకరించింది. గతంలో తెల్లరేషన్ కార్డులపై రాజ ముద్రతో పాటు కుటుంబ సభ్యుల ఫొటోలు ఉండేవి. అప్పటి సీఎం జగన్ ప్రచార ఆర్భాటం కారణంగా వైసీపీ హయాంలో ప్రభుత్వం జారీచేసే అన్ని పత్రాలపైన తన ఫొటో వేసుకున్నారు. దీని కనుగుణంగానే గత ఐదేళ్లలో రేషన్ కార్డులతో పాటు జనన, మరణ, రిజిస్ట్రేషన్, పేదలకు ఇచ్చే ఇళ్ల పట్టాలు, కుల ధ్రువీకరణ ఇలా ప్రతి పత్రంపై జగన్ ఫొటోలు దర్శన మిచ్చేవి. కూటమి ప్రభుత్వం ఈ ఆర్భాటాలకు దూరంగా ఉంది. జగన్, వైఎస్ రాజశేఖరరెడ్డిల ఫొటోలతో జారీ చేసిన తెల్లరేషన్ కార్డులను పూర్తిగా తొలగించి కొత్తవాటిని లబ్ధిదారులకు అందించాలని యోచించింది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కార్డులను మార్చాల్సి ఉండటం, పెద్ద ఖర్చుతో కూడిన పనిని తాత్కాలికంగా బ్రేక్ వేసింది. ప్రస్తుతం 100 రోజుల పాలన పూర్తి కావడంతో ఇటువంటి ఫొటోలతో జారీచేసిన కార్డులను తొలగించి వాటి స్థానంలో రాజ ముద్రతో కూడిన కార్డులను జారీచేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం పశ్చిమలో ఈ తరహా కార్డులు 5,67,657 ఉన్నాయి.అంత్యోదయ కార్డులు మరో 3,200 వరకు ఉన్నాయి. త్వరలో వీటిని పూర్తిగా తొలగించి కొత్త వాటిని అందించనున్నారు. ఈ ప్రక్రియ ఈ ఏడాది చివరినాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సివిల్ సప్లై వర్గాలు చెబుతున్నాయి.



జిల్లా రోడ్లకు కేంద్ర నిధులు

జాతీయ రహదారులకు అనుసంధానం చేసే రాష్ట్ర రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. జిల్లాలోని భీమవరం నుంచి లోసరి వరకు, భీమవరం నుంచి పిప్పర వరకు రహదారుల అభివృద్ధికి రూ.99.65 కోట్లు మంజూరుచేసింది. ఈ ఫైల్‌పై బుధవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంతకాలు చేశారు.

భీమవరం-లోసరి, భీమవరం - పిప్పర రహదారుల అభివృద్ధికి రూ.99.65 కోట్లు మంజూరు

భీమవరం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భీమవరం జిల్లా కేంద్రం అయినప్పటికీ వైసీపీ హయాంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. భీమవరం-తాడేపల్లిగూడెం రహదారి అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు నరకం చూస్తున్నారు. అలాగే భీమవరం నుంచి లోసరి మీదుగా విజయవాడ, మచిలీపట్నం వెళ్లేందుకు ప్రయాణం కష్టతరంగా ఉంది. ఈ క్రమంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టింది. భీమవరం-లోసరి, భీమవరం-తాడేపల్లిగూడెం రోడ్ల అభివృద్ధికి గతంలో వున్న ప్రతిపాదనలకు మోక్షం కలిగించింది. తాజాగా రహదారి విస్తరణతో ఈ రోడ్ల సమస్య తీరనుంది. భీమవరం నుంచి దొంగపిండి వరకు 11.4 కిలో మీటర్లు, గూట్లపాడు-బర్రెవానిపేటకు 15.53 కిలో మీటర్ల రోడ్ల విస్తరణకు రూ.43 కోట్లు మంజూరు చేసింది. భీమవరం నుంచి పిప్పర వరకు 15.47 కిలోమీటర్ల మేర విస్తరణ, అభివృద్ధికి రూ.56.40 కోట్లు కేటాయించారు.



భీమవరం : రోడ్ల అభివృద్ధిపై నిధుల మంజూరుకు సంబంధించిన పోస్టర్‌ను అవిష్కరించిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) తదితరులు

సాంకేతికతను ఉపయోగించాలి

ఈ రహదారుల వెంబడి కాల్వలు ఉండటం వల్ల ఇది కుంగిపోతోంది. దెబ్బకు గుంతలు ఏర్పడుతున్నాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి కుంగిపోకుండా రివిట్‌మెంట్ ఏర్పాటుచెయ్యాలి. లేదంటే ఎఫ్‌బీఐ సాంకేతికతను ఉపయోగించి రహదారులను అభివృద్ధి చేయాలి. అప్పుడే ఇవి మన్నికగా ఉంటాయి. వైసీపీ హయాంలో ఎఫ్‌బీఐ టెక్నాలజీతో ఐదు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. కాంట్రాక్టర్లు స్పందించలేదు. ఫలితంగా రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో త్వరలోనే ఈ రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ప్రయాణికుల వెతలు తీరతాయి.

రహదారులకు కేంద్రం పెద్దపీట : కేంద్ర మంత్రి వర్మ

'కేంద్రం రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా పశ్చిమ గోదావరి సంబంధించి రెండు రోడ్ల అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులను కేంద్ర ఉపరిత రవాణా మంత్రిత్వ శాఖ కేటాయించింది' అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ గురువారం విలేకరులకు తెలిపారు. భీమవరం, ఉండి ఎమ్మెల్యేలు అంజిబాబు, రఘురామకృష్ణరాజులు రోడ్ల అభివృద్ధి విషయాన్ని నా దృష్టికి తీసుకువచ్చి, కేంద్ర నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరారు. సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సీఆర్‌ఐఎఫ్) ద్వారా భీమవరం-లోసరి, భీమవరం-తాడేపల్లిగూడెం (పిప్పర) రోడ్డు అభివృద్ధికి రూ.99 కోట్ల 65 లక్షలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మంజూరు చేస్తూ బుధవారం రాత్రి ఆమోదించారు. రాష్ట్రానికి రూ.400 కోట్లు కేటాయించగా ఇందులో 100 కోట్లు మన జిల్లా రోడ్ల అభివృద్ధికి ఇచ్చారు. త్వరలో అధికారులు రోడ్లను పరిశీలించి చర్యలు తీసుకుంటారు' అని తెలిపారు. ఈ మేరకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గడ్కరీకి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

యనమదుర్రు వంతెన అప్రోచ్‌కు రూ.36 కోట్లు మంజూరు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరం రూరల్ మండలంలోని యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు రూ.36 కోట్లతో అప్రోచ్ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ విషయంపై భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చొరవ చూపారు. రాష్ట్ర భవనాల శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. త్వరలో టెండర్లు పిలవనున్నారు. వాస్తవానికి వైసీపీ హయాంలో అప్రోచ్‌లు నిర్మించాల్సి ఉంది. ఎన్నికల ముందు సీఎం హోదాలో జగన్ భీమవరం వచ్చినపుడు అప్రోచ్ రోడ్డుకు రూ.36 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. టెండర్లు పిలిచారు. కాని, కాంట్రాక్టర్లు స్పందించలేదు. చివరికి నిధులు మురిగిపోయాయి. కొత్త బడ్జెట్ కేటాయిస్తే టెండర్లు పిలవడానికి అవకాశం ఉంటుందని జిల్లా అధికారులు స్పష్టం చేశారు. రూరల్ ప్రజల ఆకాంక్ష కలగానే మిగిలిపోయే ప్రమాదం ఏర్పడింది.

యనమదుర్రు ఇరు వైపులా ఉన్న భీమవరం రూరల్ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంది. ఓ వైపున యనమదుర్రు, దిరుసుమర్రు, నాగిడిపాలెం మరో వైపు గొల్లవానితిప్ప, గూట్లపాడు, దొంగపిండి, దెయ్యాలతిప్ప, లోసరి తదితర గ్రామాల మధ్య రాకపోకలు సాగించాలంటే భీమవరం రావాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ కదలిక వచ్చింది. త్వరలోనే టెండర్లు పిలిచేందుకు సన్నహాలు చేస్తున్నారు.

కేంద్ర మంత్రి వర్మకు అభినందనలు : ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం-లోసరి, భీమవరం-తాడేపల్లిగూడెం రోడ్ల అభివృద్ధితో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. జాతీయ రహదారులకు కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధి ఎంతో కీలకమన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రోడ్ల అభివృద్ధికి సంబంధించిన పోస్టరును కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించారు.



ఆదర్శప్రాయం.. వాల్మీకి జీవితం

రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు.



ఎందుకంట భయం

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవడంలో పురుషులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు ? ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతోంది.. - 6లో..



నాలుగు కాదు.. రెండు నెలలే

రైళ్లలో అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్ సమయం ఇకపై నాలుగు నెలలు కాదు.. రెండు నెలలే. ఈ నిర్ణయంతో రైలు ప్రయాణికులకు నిజంగా ఊరట కలిగించే అంశం. -6లో..

సమాచారం

సదరం క్యాంపులు.. ఎప్పుడు ? ఎక్కడ ?

భీమవరం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో ఏర్పాటు చేసిన సదరం క్యాంపులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని ధ్రువపత్రాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. తణుకు జిల్లా ఆస్పత్రిలో ఎముకలు, కండరాలు, కన్ను, మూగ, చెముడు, మానసిక వికలాంగత్వ పరీక్షలు మంగళ, శుక్రవారాల్లోను, తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రిలో ఎముకలు, కండరాలు, కంటి వైకల్యం పరీక్షలు మంగళ, శుక్రవారాల్లోను, భీమవరం ఏరియా ఆస్పత్రిలో ఎముకలు, కండరాల వైకల్యం పరీక్షలు సోమవారం, నరసాపురం ఏరియా ఆస్పత్రిలో ఎముకలు, కండరాల వికలాంగత్వ పరీక్షలు బుధవారం, పాలకొల్లు ఏరియా ఆస్పత్రిలో ఎముకలు, కండరాల వికలాంగత్వ పరీక్షలు బుధవారం క్యాంపులు నిర్వహిస్తారు. ఆకివీడు, ఆచంట పీహెచ్‌సీల్లో ఎముకలు, కండరాలు వికలాంగత్వ పరీక్షల క్యాంపులు బుధవారం జరుగుతాయి.



భారీ వర్షం.. ముందుకొచ్చిన సముద్రం

నరసాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. చినలంక, పీఎం లంక వద్ద 50 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. ఒడ్డున వున్న కొబ్బరి తోటలు, సరుగుడు తోటల్లోకి నీరు వచ్చి చేరింది. పెద్ద ఎత్తున వచ్చిన అలల హోరుకు ప్రజలు భయాందోళన చెందారు. సాయంత్రానికి హోరు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. తుఫాన్ ప్రభావంతో గురువారం మధ్యాహ్నం వరకు తీర ప్రాంతంలో వర్షం కురుస్తూనే ఉంది. ఫలితంగా రోడ్లు, పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. పట్టణంలోని రహదారులు, గ్రామాల్లోని పొలాలు చెరువులను తలపించాయి.

మొగల్తూరు/ఉండి/ఆకివీడు/పాలకోడేరు/పాలకొల్లు అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మొగల్తూరు మండలంలో ఈ నెల 14న 19.2, 15న 21.2, 16న 24.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రామన్నపాలెం పులపర్తి వారితోట కెనాల్ రోడ్డు నుంచి యాతం వారి గృహాల వరకూ, మొగల్తూరులోని గొల్లగూడెం రోడ్డు, కెనాల్ రోడ్డుపైన వర్షం నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. ఉండి కాపులపేటలోని స్టేట్ బ్యాంక్‌కు సమీపంలోని సీసీ

మిగతా 8వ పేజీలో..

ఎండా వానలతో రొయ్య ఉక్కిరిబిక్కిరి


- ఆక్సిజన్ లోపం, వైరస్‌ల దాడితో రైతులకు తీవ్ర నష్టం

ఆకివీడురూరల్ అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ఎండా వానలు దోబూచులాడుతున్నాయి. వేకువజాము వర్షం కురిస్తే తెల్లవారేసరికి ఎండ కాస్తోంది. మళ్లీ కొద్దిసేపటి తర్వాత నల్లని మేఘాలు కమ్ముకుని వర్షం కురిస్తే.. ఆపై ఎండ కమ్మేస్తోంది. కొంతసేపటికి మళ్లీ వర్షం కురుస్తోంది. వర్షం ఆగిపోగానే చిత్త ఎండ కాస్తోంది. ఎండ తీవ్రత వేసవిని మించి ఎక్కువగా ఉంటున్నది. చిత్త కార్తె కారణంగా చిత్త ఎండ కాస్తోంది. ఈ కారణంగా రొయ్యల సాగు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోంది. ఎండ తీవ్రత వల్ల చెరువుల్లో ఆక్సిజన్ అందకపోవడం, వర్షం వల్ల కూలింగ్ ఏర్పడడంతో రొయ్యలపై తీవ్ర ప్రభావం పడుతోంది. 25 రోజుల వరకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అనుకున్న రైతులు.. వాతావరణ మార్పులతో భయపడుతున్నారు. వైరస్ సోకి పంటలు పోతున్నాయి. కనీసం ఖర్చులు వస్తే చాలనుకున్నప్పటికి.. సీడ్ ఖర్చు రావడం లేదని వాపోతున్నారు. చిన్న కౌంటు మార్కెట్ రేటుకన్నా తక్కువకే కొనుగోలు చేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. ఈ స్థాయిలో ఎప్పుడు నష్టపోలేదని ఆవేదన చెందుతున్నారు.



ఆకివీడులో రొయ్యల పట్టుబడి

ఎందుకంట.. భయం ?



మానవ జీవితంలో పిల్లలను కనడం, కుటుంబ జీవనం గడపడం ఎంత అవసరమో అదే సమయంలో కుటుంబ నియంత్రణ కూడా అవసరం. పెరుగుతున్న జనాభాని అరికట్టడానికి కుటుంబ ఆర్థిక వ్యవస్థల్ని స్థిరపరుచుకోవడానికి కుటుంబ నియం త్రణ ఎంతో ముఖ్యం. కుటుంబ నియంత్రణకు పురుషులు చేయించుకునే వాసెక్టమీ ఆపరేషన్ల విషయంలో అనేక అపోహలు ప్రచారంలో ఉండడం వల్ల అధిక శాతం ముందుకు రావడం లేదు. మహిళలే ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. 'కోత-కుట్టు' లేని సులువైన శస్త్రచికిత్స (ఎన్ఎస్వీ)గా పేరున్నప్పటికీ వాసెక్టమీ పట్ల పురుషుల్లో నెలకొన్న అనాసక్తి నేపథ్యంలో ఉమ్మడి జిలాల్లో పరిస్థితులు, ప్రభావి తాంశాలపై ప్రత్యేక కథనం..

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు వెనుకంజ వేస్తున్న పురుషులు

ఏటా రెండంకెలు దాటని వాసెక్టమీ ఆపరేషన్లు

అపోహలు, కుటుంబ సంప్రదాయాలకు తోడు సంస్థాగత సమస్యలు

వేలల్లో ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి భయాందోళనలకు తావులేని వాసెక్టమీ శస్త్ర చికిత్సలను ప్రోత్సహించడానికి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో సరైన అవగాహన కల్పించడం లేదన్న వాదన లేకపోలేదు. జిల్లాలో మహిళలకు ట్యూబెక్టమీ, పురుషులకు వాసెక్టమీ శస్త్రచికిత్సల్లో భారీవ్యత్యాసమే దశాబ్దాల తరబడి కొన సాగుతోంది. అక్షరాస్యతలో అగ్రస్థానంలో వున్న గోదావరి జిల్లాల్లో వాసెక్టమీ ఆపరేషన్లలో మాత్రం అట్టడు గునుండటం గమనార్హం. జిల్లాకేంద్రంలో సర్వజన ప్రభుత్వాసుపత్రి, చింతలపూడి, నూజివీడు,జంగారెడ్డి గూడెంలలో ఏరియా ఆస్పత్రులు, బుట్టాయ గూడెం, భీమడోలు, దెందులూరు, కైకలూరు, పోల వరంలలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. వీటితో పాటు ద్వారకా తిరుమల, సీహెచ్ పోతేపల్లి, కాగుపాడు, అగిరి పల్లిలో పీహెచ్సీలు కూడా ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లకు ఉద్దేశించారు.

వీటికి అదనంగా ప్రసవాలు, కుటుంబ నియంత్ర ణకు ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు చేసేందుకు 57 ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఉన్నాయి.

వెనుకంజ ఎందుకంటే..

ఆపరేషన్ చేయిచుకుంటే లైంగిక సామర్థ్యం తగ్గి పోతుందనే అపోహ, భారీ పనులు చేసే శక్తి తగ్గి పోతుందనే భయాందోళనలు పురుషల్లో ఉండటం వాసెక్టమీ ఆపరేషన్ వైపు మొగ్గు జూపక పోవ డానికి ఓ కారణం. పనిలోపనిగా మహిళలకు ప్రసవంతో పాటే ట్యూబెక్టమీ ఆపరేషన్ కూడా చేయించడం వల్ల రెండింటికీ కలిపి ఒకేసారి తగినంత విశ్రాంతి తీసుకునే వెసులుబాటు ఉంటుందనే అభిప్రాయంతో వాసెక్టమీకి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మెజార్టీ కుటుంబాల్లో మహిళలే తమ భర్త వాసెక్టమీ చేయించుకోవడానికి ఇష్టపడటం లేదని వైద్యవర్గాలు వివరించాయి.

ఏటా రెండంకెలు దాటని ఆపరేషన్లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభజన తర్వాత ఏలూరు జిల్లాలో 2022-23 సంవత్సరంలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు మొత్తం 4,481 జరగ్గా, వాసెక్టమీ శస్త్ర చికిత్సలు కేవలం 27 మాత్రమే చేయగలిగారు. 2023-24 సంవత్సరంలో ట్యూబెక్టమీ 4,476 చేయగా, వాసెక్టమీ చాలా తక్కువగా అంటే 20 తోనే సరిపెట్టాల్సి వచ్చింది. ఇక ప్రస్తుత సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆరునెలల కాలంలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు 2,367 కాగా, వాసెక్టమీ 11కే పరిమితమయ్యాయి. ఇవన్నీ ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగినట్టుగా గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాకు వాసెక్టమీ శస్త్రచికిత్సలు ఏడాదికి 200 ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా, గడచిన రెండు దశాబ్దాల్లో ఏనాడూ రెండంకెలను దాటలేదు. రెండో కాన్పునకు ఆస్పత్రికి గర్భిణి వచ్చిన వెంటనే వాసెక్టమీ ఆపరేషన్పై పురు షులకు అవగాహన కల్పిస్తున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నా ప్రయోజనం అంతంత మాత్రమే.

ప్రభుత్వపరంగా లోపాలు ఇవీ

జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యధిక శాతం వైద్యులు మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయడానికే శ్రద్ధ కనబరుస్తున్నారే తప్ప పురుషులకు వాసెక్టమీ చేయడానికి ముందుకు రావడం లేదు. జిల్లాలో 62 పీహెచ్సీలుండగా, వాటిలో విధులు నిర్వర్తించే వైద్యాధికారులకు ఎన్ఎస్వీ శస్త్రచికిత్సపై శిక్షణ లేకపోవడం వల్ల కేవలం 4 పీహెచ్సీల మెడికల్ ఆఫీసర్లు మాత్రమే వాసెక్టమీ ఆపరేషన్లకు పరి మితమయ్యారు. వీరిలోను వాస్తవానికి ఎన్ఎస్వీలు కేవలం ఒక్కరు మాత్రమే చేస్తున్నారని సమాచారం.

మగవారికే మంచిది



కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో పురుషులు చేయించుకోవడమే మంచిది. ఎటువంటి కోత, కుట్లు ఉండవు. నెలల తరబడి విశ్రాంతి తీసుకోవాల్సిన పనిలేదు. మహిళలకైతే బొడ్డుపైకోత చేసి గర్భసంచికి అనుసంధానమైన ఫెలోపియన్ ట్యూబులను మూసి వేయడం, కత్తిరించడం ద్వారా గర్భధారణను నియంత్రిస్తారు. ఒక్కో సందర్భంలో ఫెలోపియన్ ట్యూబు దొరకక ఆపరేషన్ ఫెయిల్యూర్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి.

-విష్ణువర్ధిని, గైనకాలజిస్ట్, వైద్య ఆరోగ్య కేంద్రం, పోలవరం

రెండేళ్లు ఇబ్బంది పడ్డా..



2015 సంవత్సరంలో ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. నాకు ఒక పాప.. ఒక బాబు. ఆపరేషన్ తర్వాత దాదాపు రెండు సంవత్సరాలు విశ్రాంతి తీసుకోవలిసి వచ్చింది. ఆపరేషన్ తర్వాత దగ్గు ఉండడం వలన పైన వేసిన కుట్లు మానడానికి ఆరు నెలల సమయం పట్టింది. లోపల వేసిన కుట్లు మానడానికి దాదాపు సంవత్సర కాలం పట్టింది. రెండేళ్ల తర్వాత కానీ నా పనులు నేను చేసుకునే పరిస్థితి రాలేదు.

-సున్నం లక్ష్మీ ప్రసన్న, తోటగొంది

అపోహలు వీడాలి



ప్రభుత్వాసుపత్రుల్లో వాసెక్టమీ ఆపరేషన్ చేయించు కున్న పురుషులకు రూ.1100 నగదు ప్రోత్సాహకంగా ప్రభుత్వం ఇస్తోంది. పురుషులను ప్రోత్సహించడానికి గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశాలు పనిచేస్తున్నారు. ముఖ్యంగా చదువుకున్న ఉన్నత విద్యావంతులు ఎక్కువగా వున్న గోదావరి జిల్లాల్లో వాసెక్టమీల వైపు పురుషులను ప్రోత్సహించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై కూడా ఉంది. కోత,కుట్టు లేకుండా చర్మం కింద చిన్న నరాన్ని కట్ చేయడంతోనే వాసెక్టమీ ఆపరేషన్ అతి తక్కువ వ్యవధిలోనే ముగుస్తుంది. దీనివల్ల ఎటువంటి నొప్పి, సైడ్ ఎఫెక్ట్ ఉండవు. కొద్ది రోజుల పాటు బరువులు ఎత్తేపనులు చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

- డాక్టర్ శర్మిష్ట, డీఎంహెచ్వో, ఏలూరు

గంటలోనే వెళ్లిపోవచ్చు



వాసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న గంట వ్యవధిలోనే ఆస్పత్రి నుంచి నడుచుకుని వెళ్ళిపోవచ్చు. అదే మహిళకు ట్యూబె క్టమీ చేస్తే కనీసం 7 రోజులవరకు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. వాసెక్టమీ వల్ల ఎస్టీడీ (సుఖవ్యాధులు) ఇన్ఫెక్షన్లు కూడా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఎప్పుడైనా పిల్లలు/సంతానం కావాలనుకుంటే వాసెక్టమీ చేయించుకున్న పురుషులు రీకానలైజెషన్ (రీసర్జరీ) చేయించుకునే వెసులుబాటు ఉంది. కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో ఎటువంటి రిస్క్ లేని శస్త్రచికిత్స ఇది.

డాక్టర్ బాలప్రకాష్, ద్వారకాతిరుమల పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్

వాసెక్టమీ అంటే.. ?

కుటుంబ నియంత్రణ కోసం పురుషులకు చేసే శస్త్ర చికిత్సే వ్యాసెక్టమీ. ఇది పూర్తిగా బాహ్యతరమైన ఆపరేషన్. బయట నుంచి చిన్న కోత లేదా గాటు ద్వారా ఆపరేషన్ చేస్తారు. ఈ ప్రక్రియ కేవలం 30 నిమిషాల సమయంలో పూర్తవుతుంది. ప్రభుత్వ



ఆసుపత్రుల్లో ఉచితంగా చేసే ఈ ఆపరేషన్లలో ఒకటి లేదా రెండు చిన్నకోతలు చేసే ముందు ఆ ప్రాంతంలో నొప్పి తెలియకుండా మొద్దుబారడానికి మత్తుమందు ఇస్తారు. కుట్లు ఉపయోగించే అవసరం కూడా ఉండదు. వైద్యులు గాయాన్ని సహజ పద్ధతిలో నయం చేస్తారు. ఆపరేషన్ అనంతరం 15 రోజులపాటు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. ఆపరేషన్ అయిన తర్వాత మూడు నెలల పాటు గర్భ నిరోధక పద్ధతులు వాడవలసి ఉంటుంది. 90 రోజుల తర్వాత వీర్య పరీక్షలు నిర్వహించి శుక్రకణాల జాడ లేకపోతే ఆపరేషన్ విజయవంతం అయినట్లు భావించాలి. వాసెక్టమీ ఆపరేషన్ ప్రక్రియ సమయంలో కొంతమంది పురుషులు నొప్పి లేదా కొంత అసౌకర్యాన్ని అనుభవించే అవకాశాలు అరుదుగా మాత్రమే ఉంటాయి. ఇన్ఫెక్షన్ లేదా రక్తస్రావం కూడా స్వల్పంగానే ఉంటుంది ఆపరేషన్ చేయించుకున్న పదిహేను రోజుల్లో యధావిధిగా తమ పనులు చేసుకోవచ్చు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విషయంలో భార్యాభర్తలు వారి కుటుంబ ఆర్థిక, ఆరోగ్య, శారీరక పరిస్థితులకు అనుగుణంగా వ్యాసెక్టమీ లేదా ట్యూబెక్టమీ అనేది నిర్ధారించుకోవాలి. **- పోలవరం**

ఆధ్యాత్మికం



సింహవాహనంపై..శ్రీవారి రాజసం

ద్వారకాతిరుమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహవాహనంపై అలివేలు మంగ, ఆండాళ్ అమ్మవార్ల సమేతంగా కొలువైన ఆ దేవదేవుడు గురువారం ఉదయం క్షేత్ర తిరు వీధుల్లో భక్తులకు దర్శన మిచ్చారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను సింహవాహనంపై ఉంచి, అర్చకులు పూలతో అలంకరించారు. యోగ మూర్తిగా అభయ హస్తాన్ని ఇస్తూ ఉన్న శ్రీవారికి నీరాజనాలు సమర్పించారు. తరువాత అట్టహాసంగా తిరు వీధులకు తరలివెళ్లిన స్వామి, అమ్మవార్లను భక్తులు కొలిచారు. దుష్ట జన సంహారానికి, భక్తజన సంరక్షణకు సంకేతంగా స్వామి సింహవాహనంపై ఊరేగారు. ఇలా ఉన్న శ్రీవారిని దర్శిస్తే భయం, బాధలు తొలుగుతాయన్నది భక్తుల నమ్మకం.

జగన్మోహిని అలంకారంలో..

అపురూప లావణ్యాలను ఒలికిస్తూ.. మోహినీ అలంకారంలో శ్రీవారు గురువారం భక్తజనులకు దర్శనమిచ్చారు. క్షీర సాగర మదనంలో ఉద్భవించిన అమృతాన్ని దేవ, దానవులకు పంచేందకు శ్రీమహా విష్ణువు స్త్రీ రూపంలోకి మారారు.



భక్తులకు మాలధారణ చేస్తున్న ప్రధాన అర్చకుడు మల్లిఖార్జున శర్మ

మావుళ్ళమ్మ మాలధారణ

భీమవరం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో గురువారం 40 మంది భక్తులు మావుళ్ళమ్మ మాల ధారణ స్వీకరించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జునశర్మ ముందుగా పూజలు చేసుకుని మాల ధారణ స్వీకరించారు. అనంతరం 40 మంది భక్తులచే విఘ్నేశ్వరపూజ, మాలలకు పూజలు చేసి హారతి ఇచ్చి అనంతరం మాలధారణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ మహాలక్ష్మీ నగేష్ పర్యవేక్షించారు. పౌర్ణమి పురస్కరించుకుని చండీ హోమం నిర్వహించారు.



ఊరేగింపులో ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

తాడేపల్లిగూడెంలో వైభవంగా వెండి రథోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి 57వ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా వెండి రథోత్సవం గురువారం వేడుకగా సాగింది. ముందుగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రథాన్ని లాగి ఊరేగింపు ప్రారంభించారు. 5 రాష్ట్రాలకు చెందిన 250 మంది కళాకారులు వారి రాష్ట్ర సంస్కృతులు ప్రతిబింబించే విధంగా కళా ప్రదర్శనల నడుమ ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. 108 మంది మహిళలు 108 కళశాలతో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. పట్టణంలోని రేలంగి చిత్రమందిరం నుంచి పోలీస్ ఐలాండ్ మీదుగా ఎస్వీఆర్ సర్కిల్ వరకూ ఊరేగింపు సాగింది. ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఒబిలిశెట్టి నటరాజ్, కొర్లేపర రాము, రథోత్సవ కమిటీ అధ్యక్షుడు నారాయణ రాంబాబు తది తరులు పర్యవేక్షించారు.



రథోత్సవం ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్



108 కలశాలతో ఊరేగింపుగా మహిళలు







కల్చరల్

యూత్ ఫుల్ జోష్

యువజనోత్సవాల్లో టాలెంట్ను ప్రదర్శించిన యువత

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గగనమే గమ్యంగా కళాశాల యువత కళా ప్రదర్శనలతో ప్రతిభ కనబరచి శెభాష్ అనిపించు కున్నారు. గ్రామీణ భారతీయ కళాభినయాలు, నృత్యాలతో పాటు, పెయింటింగ్, కథారచన, కవితలు, నూతన ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన పోటీల్లో యువ శక్తిని, మేథోసంపత్తిని బాహ్యాప్రపంచానికి చాటి చెప్పారు. మొత్తం 11 ఈవెంట్లలో ఏలూరు జిల్లా లోని 15 డిగ్రీ కళాశాలలు, నూజివీడు ట్రిపుల్ ఐటీ, తాడేపల్లిగూడెం ఉద్యాన విశ్వ విద్యాలయం తదితర సాంకేతిక విద్యాసంస్థల నుంచి మొత్తం 250 మంది విద్యార్థులు ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో సందడి చేశారు. వివిధ పోటీల గ్రూప్, సోలో విభాగాల నుంచి ప్రథమస్థానం విజేతలను నవంబరులో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు పంపిస్తామని సెట్వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకరరావు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబందించి యువజ నోత్సవాలను ఈనెల 26న తణుకులో నిర్వహించనున్నట్టు వివరించారు.ప్రారంభ కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ యువతలోవున్న ప్రతిభను వెలికితీయడానికి యువజనోత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తొలుత స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేశారు. జిల్లా యూత్ ఆఫీసర్ డి.కిషోర్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, మైనార్టీస్ వేల్ఫేర్ ఆఫీసర్ కృపావరం, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మధుభూషణరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రజిత, టూరిజం అధికారి పట్టాభి, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు :

జానపదనృత్యం గ్రూప్డ్యాన్స్లో సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలకు చెందిన లక్ష్మీ ప్రసన్న గ్రూప్ ప్రథమ, చింతలపూడి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన సావిత్రి గ్రూప్ ద్వితీయ, కైకలూరు వై.వి.ఎస్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మీనాక్షి గ్రూప్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. సోలో విభాగంలో ఆదిత్య డిగ్రీ కళాశాలనుంచి బి.జాహ్నవి, పి.నవీన, సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి ఎం.ప్రీతిశ్రీజ విజేతలుగా నిలిచారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ఆవి ష్కరణల పోటీ వ్యక్తిగత విభాగంలో సెయింట్ థెరిస్సా కళాశాల విద్యార్థినులు ఎస్.అఖిల, పి.వి.దీప్తి, ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి పి.గణేష్ విజేతలుగా నిలిచారు. ఇదే పోటీ గ్రూప్ విభాగంలో సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి కె.లక్ష్మీదుర్గ, ఎస్కే.జాస్మిన్ బృందం, కె.అఖిల, కె.సాహ్నవి బృందం, ఎస్కే. జీనత్, వి.స్రవంతి బృందాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.పద్యాల పోటీ తెలుగు విభాగంలో సీఆర్ఆర్ కళాశాలనుంచి కె.జయఫణీంద్ర, చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఆర్.సంతోష్, తాడేపల్లిగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి డి.రాజ్యలక్ష్మి, ఇంగ్లీషు విభాగంలో సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి ఎం.డి బషీరున్, డి.రేణు షాసామ్, కె.దామిని సుధ విజేతలుగా నిలిచారు. జానపద పాటలపోటీ సోలో నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి పి.కళ్యాణ్ హరితాస్, కె.ప్రశాంత్, సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి కె.దామిని సుధ గ్రూప్ విభాగంలో ట్రిపుల్ ఐటీ నుంచి కె.ప్రశాంత్ బృందం, సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి చిన్నారి బృందం, ట్రిపుల్ ఐటీ నుంచి డి.నవ్యశ్రీ బృందం విజేతలుగా నిలిచాయి. స్టోరీ రైటింగ్ పోటీలో సెయింట్ థెరిస్సా నుంచి కె.దామినిసుధ, ఎ.సుజాతరావు, సీఆర్ఆర్ కళాశాలనుంచి జి.పద్మావతి విజేతలుగా నిలిచారు. పెయింటింగ్లో ఏలూరుకు చెందిన మహ్మద్ సమీర్, ఎన్.దివ్య, సీహెచ్.గాయత్రి వక్తృత్వంలో ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి జె.క్రిషిత, కె.నవ్యశ్రీ, నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి ఎన్.పద్మజ విజేతలుగా నిలిచారు.



వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న జడ్పీ చైర్పర్సన్..



విద్యార్థినుల జానపద గీతాలాపన..



జానపద నృత ప్రదర్శన

రైల్వే ప్రయాణికులకు తీపి కబురు

అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్ రెండు నెలలకు కుదింపు



నరసాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులకు గురువారం ఆ శాఖ తీపికబురు చెప్పింది. అడ్వాన్స్ రిజర్వేషన్ టిక్కెట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వస్తున్న విమర్శల్ని పరిగణలోకి తీసుకుని టిక్కెట్ బుకింగ్ సమయాన్ని 60 రోజులకు తగ్గించింది. అంటే నాలుగు నెలల ముందుగా అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించు కోవాల్సిన అవసరం లేదు. రెండు నెలలు ముందుగా బుకింగ్ చేసుకుంటే సరిపోతుంది. ఈ కొత్త విధానం వచ్చేనెల నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటి వరకు రిజర్వేషన్ బెర్త్లో ప్రయాణించాలంటే 120 రోజుల ముందుగా మేల్కోవాల్సి వచ్చేది. పండుగలు, వేసవి సెలవులకు దూర ప్రాంతాలు, స్వగ్రామాలకు రావాలంటే నాలుగు నెలల ముందుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకోవడం తప్ప నిసరిగా ఉండేది. లేకపోతే దొరకని పరిస్థితి. సంక్రాంతి, దసరా, వేసవి సెలవులకు రోజులు లెక్కించుకుని అడ్వాన్స్గా రిజర్వేషన్ బుక్ చేసుకోవాల్సి వచ్చేది. ఈ విధానం వల్ల కొన్ని సమయాల్లో టిక్కెట్లు రద్దు చేసుకోవాల్సి వచ్చేది. దీంతో భారీగా కోత పడేది. కొన్ని సమయాల్లో సగం డబ్బులు కూడా తిరిగి వచ్చేవి కావు. ఈ వ్యవధిని 60 రోజులకు కుదించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. చివరికి రైల్వే స్పందించి రెండు నెలల ముందుగా టిక్కెట్ల బుక్ చేసుకునే వెసులు బాటు కల్పించింది. దీని వల్ల జిల్లాలో ఎప్పుడు రద్దీగా ఉంటే నరసాపురం, నాగర్సోల్, తిరుపతి, సర్కార్, శేషాద్రి వంటి రైళ్ళకు ప్రయాణ వ్యవధిని బట్టి 60 రోజులు ముందు గానే బుక్ చేసుకోవచ్చు. ప్రయాణ వ్యవధి తక్కువగా ఉన్నందున టిక్కెట్ల రద్దు కూడా తగ్గుతుంది.

పేరుపాలెం బీచ్ వద్ద ఏర్పాట్లు చేయాలి : ఆర్డీవో

నరసాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) కార్తీక వన సమారాధనకు పేరుపాలెం బీచ్కు వచ్చే సందర్శకులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని నరసాపురం ఆర్డీవో దాసిరాజు సూచించారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్నందున బీచ్కు వచ్చే వారికి కల్పించాల్సిన వసతులపై వివిధశాఖల అధికారులతో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తాగునీరు, తాత్కాలిక టాయ్ లెట్స్, సందర్శకులు సేద తీరేందుకు తాత్కాలిక గుడిసెల నిర్మాణంతో పాటు ప్రాణ నష్టం జరగకుండా గజ ఈత గాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. బీచ్కు వెళ్లే రహదారులు, తీరం వెంబడి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బం దిని నియమించాలని తీరం నందు కార్తీకమాసం నెల రోజులు పాటు మద్యం అనుమతించవద్దని సూచించారు. డీఎస్పీ మురళీ కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాలమ్



జిల్లా స్థాయి చెస్ పోటీల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

రేపు భీమవరంలో జిల్లా స్థాయి చదరంగ పోటీలు

భీమవరం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా చదరంగ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ శనివారం భీమవరంలోని ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో జరిగే జిల్లా స్థాయి రెండో ర్యాకింగ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల బ్రోచర్లను గురువారం ఆవిష్కరించారు. ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ విజేతలు నవంబరు నెలలో జరిగే రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ పోటీలకు ఎంపికవుతారన్నారు. విజేతలకు అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం బహుమతులు ,మెమోటోలు అందిస్తారన్నారు. వివరాల కోసం 90632 24466 నంబర్లో సంప్రదించాలన్నారు.అల్లు రామకృష్ణ, సరిత, చెరుకువాడ రంగసాయి, అల్లుశ్రీనివాస్, చెస్ అసోసియేషన్ సభ్యులు మైలాపురి మురళి, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఆర్కెఆర్లో 19, 20 తేదీల్లో బ్యాడ్మింటన్ పోటీలు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 19, 20 తేదీల్లో జేఎన్టీయూకే బ్యాడ్మింటన్ మెన్ అండ్ ఉమెన్ సెంట్రల్ జోన్ టోర్నమెంట్ పోటీలు జరుగుతాయని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జగపతిరాజు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 26, 27 తేదీలలో బాస్కెట్ బాల్, నెట్బాల్ మెన్ అండ్ ఉమెన్ సెంట్రల్ జోన్ పోటీలు కూడా తమ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ సురేష్బాబు, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణరాజులు మాట్లాడుతూ సౌత్ జోన్కు వెళ్లే టీమ్సను కూడా ఇక్కడే యూనివర్సిటీ స్పెషల్ టీమ్ సెలక్ట్ చేస్తుందన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్టస్థాయి వాలీబాల్ పోటీలకు గణపవరం విద్యార్థి అఖిల్ శ్రీవర్మ

గణపవరం, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 17: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-14 వాలీబాల్ సెలక్షన్ పోటీల్లో గణపవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి అఖిలశ్రీవర్మ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన సెలక్షన్ పోటీల్లో ఎంపి కైనట్టు పీడీ ఎం.పద్మావతి తెలిపారు. వర్మను ఉపాధ్యాయులు, అభినందించారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న హరినాథ్‌బాబు

భీమవరంలో జాగ్వార్ షోరూమ్

భీమవరం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గోవర్ధన్ థియేటర్ రోడ్డులోని నిర్మలా హోమ్ మార్టులో జాగ్వార్ ఎక్స్‌క్లూజివ్ షోరూంను సూర్య ఇంటర్నేషనల్ ఎండీ డాక్టర్ పి.హరినాథ్ బాబు, ఆంధ్ర, తెలంగాణ బ్రాంచి హెడ్ అభిజిత్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హరి నాథ్ బాబు మాట్లాడుతూ భీమవరం పట్టణం లో వ్యాపార రంగం ఎంతో అభివృద్ధి సాధిస్తుం దని, ఈ ప్రాంతంలో జాగ్వార్ సంస్థను ఏర్పా టు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. మేకింగ్ ఇండియా ప్రొడక్ట్ అని, 60 దేశాల్లో విస్తరించి ఉందని, హైదరాబాద్‌లో అతి పెద్ద షోరూంను ప్రారంభించబోతున్నామని, ల్యాబ్‌ల ను కూడా ఏర్పాటు చేసి ట్రైనింగ్ కూడా ఇవ్వడం జరుగుతుందని, జాగ్వార్ సర్వీస్‌లోగాని, ప్రొడక్టులోగాని అందరి మన్ననలు పొందుతుం దని అన్నారు. జాగ్వర్ లైటింగ్ కూడా భీమవ రంలో త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. మేనేజింగ్ పార్టనర్స్ సురేంద్ర పలివెల, శ్రీకాంత్ పలివెల మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ప్రొడక్టు అందించడమే లక్ష్యమని అన్నారు. ఉద్దగిరి శివ, రవి కంతేటి, రవివర్మ, తటవర్తి నవీన్, రాహుల్, నిర్మల్ పాల్గొన్నారు.



మేడపాడులో శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల

పల్లెల ప్రగతి ఎన్డీఏతోనే సాధ్యం: మంత్రి నిమ్మల

యలమంచిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశానికి పట్టుకొమ్మలు పల్లెసీమలు అని వాటి ప్రగతి ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆర్యపేట, మేడపాడు గ్రామాల్లో గురువారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యపేటలో రూ.10లక్షలు, మేడపాడులో రూ.20 లక్షలు నిధులతో నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు మంత్రి రామానాయుడు భూమిపూజ నిర్వహించారు. మేడపాడు, ఆర్యపేటగ్రామాల్లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు మంత్రి రామానాయుడు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యంచేసి సర్పంచ్‌లను భిక్షాటన చేసేలా పంచాయతీల్లో చిల్లిగవ్వ లేకుండా చేస్తే, నేడు ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామాల్లో రూ.4500కోట్లతో 30వేల పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందజేస్తామని తెలి పారు. కార్యక్రమంలో మామిడిశెట్టి పెద్దిరాజు, చల్లా నరేంద్రకుమార్, తాడి శశిధర్, ముచ్చర్ల శ్రీనివాస్, ఆరుమిల్లి రామశ్రీనివాస్, మాతా రత్నంరాజు, పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ
ఆదాయం లెక్కింపు

కాళ్ళ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళ కూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురు వారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 127 రోజులకు గాను 19 లక్షల 36వేలు 321 రూపా యలు వచ్చాయని కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. పండితవిల్లూరు సమూహ దేవాలయాల కార్యనిర్వహణాధికారి దండు వెంకట కృష్ణంరాజు, గ్రామ పెద్దలు, దేవ స్థానం సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు.



క్రైమ్ కార్నర్

రైలు కింద పడి
యువకుడి మృతి
అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని సత్రంపాడు లోబ్రిడ్జి వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి తిరుపతి నుంచి కాకినాడ వెళ్ళే రైలు కిందపడి ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 35 నుంచి 40 ఏళ్ళ వయస్సు కలిగి ఉన్నాడు. 5.5 అడుగుల ఎత్తు, గజ్జకాయ రంగు పొట్టి చేతుల చొక్కా, నీలం రంగు లోయ రు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలా ంటి ఆధారాలు లభించలేదు. అనుమా నాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూ రు రైల్వే ఎస్‌ఐ పి సైమన్ సెల్‌నెంబర్ 99892 19559కు సమాచారం అందించా లని రైల్వే పోలీసులు కోరారు.

మహిళపై దాడి చేసిన
యువకుడిపై కేసు

నరసాపురం. అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని కాటన్‌పార్కులో గురువారం ఓ యువతిపై దాడికి పాల్ప పడిన ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ జయలక్ష్మి చెప్పారు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మన్నారు. నిందితుడు మొగల్తూరు మండ లానికి చెందిన వాడిగా గుర్తించామన్నారు.

మహిళను రక్షించిన పోలీసులు

భీమవరం క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల కలహాలతో గురువారం నాడు భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ ఆత్మహత్యకు యత్ని ంచింది. దీంతో రైల్వే పోలీసులు గమనించి ఆ మహిళను కాపాడారు. మహిళను విచా రించగా పట్టణంలోని నరసయ్య అగ్రహా రం చెందిన ధనాల లక్ష్మీగీతగా గుర్తించా రు. గీత భర్త స్వామి కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తారన్నారు. ఈమేరకు భర్తను పిలిపించిన రైల్వే ఎస్‌ఐ రమణ ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

రెండు వాహనాలు ఢీ
యువకుడి మృతి

పోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోడూరు చేపలు చెర్వులు వద్ద గురు వారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదు రుగా ఢీకొన్న ప్రమాదంలో బండి గేణేశ్వ రరావు(22) మృతి చెందాడు. ఎస్‌ఐ కె.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. పెనుమంట్ర మండలం నౌడూ రు గ్రామానికి చెందిన గణేశ్వరరావు పోడూరు నుంచి మినిమించిలిపాడు వెళ్తు ండగా ఆచంట వేమవరంకు చెందిన వర ద శివరామకృష్ణ మినిమించిలిపాడు నుం చి పోడూరు వస్తున్నాడు. దీంతో వీరి వాహనాలు రెండూ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈప్రమాదంలో బండి గణేశ్వర రావు(22) తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శివరామకృష్ణకు తీవ్రగా యాలు కావడంతో భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అన్నపై హత్యాయత్నం కేసు

పోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొమ్ముచిక్కాలలో తమ్ముడిపై హత్యాయ త్నం చేయబోయిన అన్నపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోడూరు ఎస్‌ఐ కె.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. చింతపల్లి కుమారస్వామి, చింతపల్లి వీరవెంకట సత్యనారాయణ అన్నదమ్ములు. వీరిద్దరికీ ఆస్తి పంపకం లో చాలా కాలంగా తగాదా పడుతున్నారు. గురువారం ఆస్తి విషయంలో మళ్లీ తగాదా పడ్డారు. ఈక్రమంలో అన్న వీరవెంకట సత్యనారాయణ తన తమ్ముడు కుమారస్వామిని కత్తితో కాలిపై గాయ పర్చాడు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నపై హత్యాయత్నం కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

కాళ్ళ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదుపై కాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో గురు వారం కేసు నమోదైంది. ఏలూరుపాడు గ్రామానికి చెందిన అదిగిరి నాగలక్ష్మికి ఆకివీడు మండలం దుంపగడప గ్రామా నికి చెందిన మావుళ్ళయ్యతో సుమారు 26 ఏళ్ళ క్రితం వివాహం అయ్యింది. అయితే పెళ్లైయిన ఇన్ని సంవత్సరాలకు ఆమెను మరో లక్ష రూపాయలు అదనపు కట్నం తీసుకురావాలంటూ అత్తింటివారు వేధి స్తూన్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై కాళ్ళ ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నారులకు అందని
కొత్త పుస్తకం



అంగన్‌వాడీ కేంద్రాల్లో పాత పుస్తకాలతోనే బోధన

అత్తిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచా యి. ఇంకా అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త పాఠ్య పుస్తకాలు చేరలేదు. ఫలితంగా చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించే ందుకు ఆటంకం కలుగుతున్నది. అరకొరగా ఉన్న పాతవాటితోనే బోధన సాగిస్తున్నా పెద్దగా ప్రయోజనం కనిపిం చడం లేదు. కొందరు ఇంటి నుంచే రాత పుస్త కాలు తీసుకుని వచ్చి సాధన చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం త్వరితగతిన పాఠ్యపుస్త కాలు అందించేలా చర్యలు తీసుకోవా లని చిన్నారుల తల్లి దండ్రులు కోరుతున్నారు. జిల్లాలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో 1556 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు కాగా 70 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడు నుంచి 6 సంవత్సరాల పిల్లలు 19678 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పూర్వ ప్రాథమిక విద్య అందించి ఆ తరువాత వారు నేరుగా ఒకటవ తరగతిలో చేరేలా అధికారులు గతంలో చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు పాఠ్యపుస్తకాలపై రూపకల్పనతో పాటు ప్రణా ళిక సిద్ధం చేసి అమలు చేశారు. పీపీ (ప్రీ ప్రైమరీ) 1,2 పేరిట రెండు రకాల పుస్తకాలను పంపిణీ చేసి వాటి ఆధారంగా విద్యా బోధన జరిపేవారు. పాటలు, పద్యాలతో పాటు నెలలు, వారాలు, రోజులు తదితర అంశాలను వివరించే వారు. ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఏ రోజు ఏమి బోధించాలనేది పట్టిక రూపంలో ఇస్తూ ఉండేవారు. ఆంగ్లంలో సులువుగా అర్ధమయ్యే పదాలు చెప్పడం వాటి అర్థాలు తెలుసు కోవడం, సృజనాత్మకత ఆటలు వంటి నృత్యాలు చేయించేవారు. ప్రస్తుతం పుస్తకాలు రాకపోవడంతో అవిఏమి సక్రమంగా అమలు కావడం లేదు.

పునఃశ్చరణకు దూరం

చిన్నారులు విద్య నేర్చుకోవడంలో తల్లి దండ్రుల పాత్ర కూడా ఉండాలనే ఉద్దేశంతో అధికారులు గతంలో ఒక నిర్ణయం తీసుకున్నారు. కేంద్రాలకు వచ్చే పిల్లల తల్లుల ఫోన్ నెంబర్లతో తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా కేంద్రాల్లో ఉదయం బోధించిన అంశాలు, చేయించిన వాటికి సంబంధించిన వివరాలను వాట్సాప్‌లో పంపేవారు. సాయంత్రం ఇంటి వద్ద పునఃశ్చరణ చేయించేవారు. ప్రస్తుతం పుస్తకాలు లేకపోవడంతో అదేమి జరగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం త్వరితగతిన పాఠ్యపుస్తకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎడ్యుకేషన్

మునిసిపల్ టీచర్ల
సత్యాగ్రహ దీక్ష



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు తెరవాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పండిట్, పీఈటీ పోస్టులను అప్ గ్రేడ్‌చేసి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఖాళీగా వున్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైనవారికి పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీచేయాలన్నారు. పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించా లన్నారు. అప్‌గ్రేడ్‌చేసిన ప్రాథమి కోన్నత పాఠ శాలల్లో సబ్జెక్టు టీచర్ల నియామకాలను చేపట్టా లన్నారు. టీచర్ల సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబరు 24న పాఠశాలవిద్య కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడ తామని హెచ్చరించారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.



లావణ్య, జాహ్నవి, ఉషా కిరణ్

అగ్రిసెట్‌లో మార్టేరు
విద్యార్థుల ప్రతిభ

పెనుమంట్ర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు అగ్రిసెట్-2024 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసా య విశ్వవిద్యాలయం ఆగస్టు 27వ తేదీన నిర్వహించిన అగ్రిసెట్- 2024 పరీక్షా ఫలి తాల్లో మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని మట్టా లావణ్య, పి. జాహ్నవి, జక్కి ఉషా కిరణ్ రాష్ట్ర వ్యాప్తంగా 2, 4, 14 ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్, పరిశోధ నా సహ సంచాలకులు డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 14 69 మంది విద్యార్థులు పరీక్షకు హాజ రుకాగా వారిలో 1447మంది అర్హత సాధించారని తెలిపారు. మార్టేరు నుంచి అగ్రిసెట్- 2024కు 32 మంది హాజరు కాగా 100 లోపు 11 మంది, 200 లోపు 17 మంది ర్యాంక్ సాధి ంచారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నామాల శ్రీనివాసరావు తెలిపారు. రెండు సంవత్సరాల వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులు అగ్రిసెట్ ద్వారా బీఎస్సీ అగ్రికల్చర్ డిగ్రీ లో చేరటానికి అర్హత సాధిస్తారు.

నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా
ప్రొఫెసర్ రమణారావు



తాడేపల్లిగూడెం, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి) : ఏపీనిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రాయపూర్ (చత్తీస్ ఘడ్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణారావు నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి గురువారం తెలిపారు. గతంలో ఈయన వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్‌గా పని చేశారని, త్వరలోనే ఏపీనిట్ ఇన్‌చార్జి డైరెక్ట ర్‌గా బాధ్యతలు చేపడతారన్నారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి వ్యవహ రించారు.

నూరుశాతం అక్షరాస్యత
లక్ష్యంగా ఉల్లాస్

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నూరు శాతం అక్షరాస్యత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నూతన అక్షరాస్యత కార్యక్రమం 'ఉల్లాస్' జిల్లాలో అమలు కు చర్య లు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు అధికారులను ఆదేశిం చారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కన్వర్జెన్సీ కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహా యక సంఘాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరా స్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. స్వయం సహాయ సంఘాలు లబ్ధిదారులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే నైట్ వాచ్మెన్‌లను అక్ష రాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారించాలన్నారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జి.సీహెచ్ ప్రభాకర్, కమిటీ సభ్యులు డీఆర్ డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగో పాల్, డీఈవో జి.నాగమణి తదితరులు పాల్గొ న్నారు.



ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో
ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వినూత్న పరిష్కారాలను ప్రదర్శించి తమ ప్రతిభను కనబరిచారని, నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ డాక్టర్ అమరేం ద్రకుమార్, ఏవో లక్ష్మణరావు తెలిపారు. నూజి వీడు ట్రిపుల్‌ఐటీ కేంద్రంగా పారాబోలా9 సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15,16 తేదీల్లో హ్యాకథాన్ నిర్వహించగా, మొత్తం 12 జట్లు పాల్గొని తమ వినూత్న పరిష్కారాలను ప్రదర్శించాయన్నారు. ఈ హ్యాకథాన్ ద్వారా విద్య, పరిశ్రమల మధ్య అంతర్యాన్ని తగ్గించేందుకు అవకాశం ఏర్పడిం దని, ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. కాగా ఈ కార్య క్రమంలో పారాబోలా సంస్థ చీఫ్ టెక్నికల్ ఆఫీ సర్ ప్రణవమూర్తి, డీన్‌ఆఫ్ అకడమిక్స్ శ్రావణి, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బండి ప్రసాద్, సీఎస్‌ఈ హెచ్‌ఓడీ నాగార్జునాదేవి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అమెరికా విశ్వవిద్యాలయ ప్రతినిధులు

ఉన్నత విద్యనభ్యసిస్తే ఎన్నో అవకాశాలు

పెంటపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : భారతీయ విద్యార్థులు యూఎస్‌లో ఉన్నత విద్య ను అభ్యసిస్తే అపార అవకాశాలను అందిపు చ్చుకోవచ్చునని ఏపీనిట్ డీన్ స్టూడెంట్స్ కెరీర్ అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ కార్తీక్ శేషాద్రి సూచించారు. నిట్‌లో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్, అలుమ్ని ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఇనిక్సా కెరీర్ కన్సల్టెన్సీ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికాలోని తొమ్మిది విశ్వ విద్యా లయాల ప్రతినిధులతో హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ అసోసియేట్ డీన్‌లు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ జి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ యూ ఎస్‌ఏలో ఉన్నత విద్యను అభ్యసించాలని చాలా మంది విద్యార్థులు కలలు కంటారు. కానీ ఏ విశ్వ విద్యాలయంలో ఎటువంటి కోర్సులు ఉంటా యి, వసతులు వంటి విషయాలు తెలియక ఎంతో మంది వెనకడుగు వేస్తున్నారని తెలి పారు. యూఎస్ వెళ్ళి తమ భవిష్య త్‌ను ఉన్న తంగా తీర్చిదిద్దాలనుకునే విద్యార్థులకు ఈ ఫెయిర్ ఎడ్యుకేషన్ దోహదపడుతుందని వివరించారు.

ఆర్టీసీ అధికారులకు
గెజిటెడ్ హోదా

ఏలూరు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశారు. అందులో పనిచేసే అధికారులకు గెజిటెడ్ హోదా కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాజపత్రాన్ని విడుదల చేసింది. ఆర్టీసీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు గెజిటెడ్ లెవెల్ -5 హోదా కల్పించారు. రీజినల్ మేనేజర్ దానికి సమానమైన హోదాలో ఉన్న అధికారులకు గెజిటెడ్ లెవల్ -4గా కల్పించారు. డివిజినల్ మేనేజర్ అండ్ దానికి సమానమైన హోదాకు గెజిటెడ్ లెవెల్ -3గా హోదా కల్పించారు. జూనియర్ స్కేల్ సర్వీస్ వారికి గెజిటెడ్ లెవెల్ -2గా హోదా కల్పించారు. అసిస్టెంట్ మేనేజర్ (ఫైనా న్స్), అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్), అసి స్టెంట్ మేనేజర్ (స్టాటిస్టిక్స్), అసిస్టెంట్ మేనేజర్ (మెటీరియల్స్ పర్చేజ్)లకు, నర్సింగ్ సూపరింటెండెంట్, చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్), అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రి కల్), అసిస్టెంట్ ఇంజనీర్ (మెకాని కల్)లకు గెజిటెడ్ లెవెల్ -1గా హోదా లు కల్పిస్తూ రాజపత్రంలో పేర్కొన్నా రు. దీంతో ఆర్టీసీ అధికారులు ఇకపై గెజిటెడ్ అధికారులుగా గుర్తింపు పొందనున్నారు.



మాట్లాడుతున్న కృష్ణమాచార్యులు

31 నుంచి పారిశుధ్య
కార్మికుల సమ్మె

ఏలూరు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు పీఎఫ్ బకాయిలు కాంట్రాక్టర్ చెల్లించకపోతే ఈనెల 31వ తేదీ నుంచి సమ్మె చేస్తా మని ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, జిల్లా కార్యదర్శి దత్తాత్రేయ (దత్తు) ప్రకటించారు. ఏలూరు ప్రభుత్వాసుప త్రిలో ఆ సంఘ కార్యవర్గ సభ్యులు గురువారం సమావేశమయ్యారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నెల ల జీతాలు పారిశుధ్య కార్మికులకు ఇవ్వా లని, కాంట్రాక్టర్‌కు ఉన్న కాంట్రాక్టు నవంబర్ నెలతో ముగుస్తుందని ఈ నెలాఖరులోపు తమ సొమ్ములను చెల్లిం చకపోతే ఈనెల 31వ తేదీన సమ్మె ప్రార ంభిస్తామని ప్రకటించారు. ఈ మేరకు నోటీసులను అందించామన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి అంచలంచల నిరసన కార్యక్రమాలు చేపడతామని, జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లోని కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి గంట పాటు నిరసన తెలియజేస్తారన్నారు.

రొయ్యలు, చేపల్లో వ్యాధులు గుర్తించాలి



మత్స్య సహాయకులకు ల్యాబ్‌లో శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఉండి అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రొయ్యలు ..చేపల్లో వచ్చే వ్యాధులను సమయానుకూలంగా గుర్తించి వాటికి తగిన చర్యలు చేపట్టాలని ఉండి కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.మల్లికార్జునరావు, మత్స్య శాస్త్రవేత్త డా.ఎ.శ్రీనివాసరావు సూచిం చారు. గురువారం ఎస్ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మత్స్యసహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడు తూ జిల్లాలో చేపలు, రొయ్యలు పెంపకం వరి తరువాత అతిముఖ్యమైనదన్నారు. చేపలు, రొయ్యల పంటలు పండించే ఆక్వారైతులకు మత్స్యసహాయకులు అందుబాటులో వుండి తగిన సూచనలు సలహాలు ఎప్పటికప్పుడు అందించా లని సూచించారు. వరిపంటలా కాకుండా చేపలు, రొయ్యలలో నష్ట అధికంగా వుంటుందని అన్నారు. ప్రస్తుతం చేపల్లో ఎక్కువగా రెడ్ డీసీజ్, శంఖు, జలగ, చేప పేను, పొట్ట ఉబ్బు వ్యాధి కనిపిస్తున్నాయని తెలిపారు.

వర్షా కాలంలో తీసుకోవలసిన చర్యలు

వర్షాలు పడుతున్న సమయంలో చేపలు, రొయ్యలలో తగు చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ప్రస్తుత సమయంలో నీటి నాణ్యత ఎంతో అవసరమన్నారు. నీటి నాణ్యతను మెరుగు పరచడానికి సున్నం ఎకరానికి 30కేజీలు చల్లు కోవాలని సూచించారు. వెంకటరామన్నగుడెంకు చెందిన మత్స్యశాస్త్రవేత్త డా.దేవి వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రొయ్యల వ్యాధుల యాజమాన్యం గురించి వారికి వివరించారు. చెరువులో నీటిని నింపి, బ్లీచింగ్ పౌడరుతో శుద్ధి పరచుకోవా లన్నారు. తరువాతే ధ్రువీకరణ హ్యాచరీ నుంచి రొయ్యపిల్లలు తెచ్చుకుని వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వినయలక్ష్మీ, రజిత, వివిధ గ్రామాల నుంచి మత్స్యసహాయకులు హాజరయ్యారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు వద్దు

తణుకు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1,2, తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి 26 వరకు ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో తిరుపతిలో శిక్షణ ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను విద్యార్థులకు దూరం చేయడం వల్ల తీరని నష్టం జరుగుతుందన్నారు

ఘనంగా హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు

నరసాపురం టౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకల్ని రాష్ట్ర అధ్యక్షుడు చింపతల్లి రవి ఆధ్వర్యంలో గురువారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణ, మండలంలో అభిమానులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభాస్ మిత్రుడు మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు హాజరై అభిమానులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. పలు చోట్ల కేక్‌లు కట్ చేశారు. స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల గేట్ వద్ద ప్రభాస్ అభిమానులు భారీ కేక్‌ను కట్ చేశారు. చింతపల్లి రవి, పులపర్తి దత్తు, మురళీ, దొండపాటి బాబి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

తణుకు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత పాటించాలని సబ్‌యూనిట్ అధికారి జి. వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణ పరిధిలోని సోషల్ వెల్ఫేర్ కాలేజి హాస్టల్, ఇరగవరం కాలనీలో బీసీ హాస్టళ్లను గురువారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో కళాశాలకు వెళ్ల లేకపోతే వెంటే వార్డు సెక్రటరీ, ఆశా కార్యకర్తలకు తెలియజేయాన్నారు. ఆరోగ్య సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయాలి

పెనుగొండ,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పెనుగొండ బస్టాండ్‌లో టాయ్‌లెట్స్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు ఎస్. వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఎంపీడీవో టి. సూర్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. గ్రామ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ మహిళా ప్రయాణికులు, విద్యార్థినులు, మరుగు సదుపాయం లేక ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు, రాజమహేంద్రవరపు వెంకటేష్ పాల్గొన్నారు.

వడలిలో ఇంటింటా సర్వే

పెనుగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వైరల్ ఫీవర్లు, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున వడలి గ్రామంలో గ్రామ స్థాయి ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే చేసి జాగ్రత్తలు వివరిస్తున్నారు. అవసరమైన వారిని సిద్ధాంతం పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్య సహాయం అందిస్తు న్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద, వివేకా నంద వీధిలో హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఎల్‌పీహెచ్‌పీలు ఉందుర్తి వసుందర మాట్లాడుతూ కాచిచల్లార్చిన నీరు తాగాలన్నారు. హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన వారిలో ఉప్పలపాటి చంటి, దొడ్డిపట్ల నాగూర్, బొర్రా నాగేశ్వరరావు, అంగర వర ప్రసాద్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

ఆకివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సమాచారహక్కు చట్టమంటే పాలనలో పారదర్శకత తీసుకురావడం కోసమేనని వ్యవసాయాధికారిని ప్రియాంక అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 2005లో వచ్చిన ఈ చట్టాన్ని వినియోగించుకుని కావాల్సిన సమాచారాన్ని పొందుతున్నారన్నారు. మండల సమాఖ్య ఏపీఎం శేషవేణి, డీవీ రమణమూర్తి, రైతులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

పెంటపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూ రీ సర్వే గ్రామసభలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్నాయని ఆయా తహసీల్దార్లు తెలిపారు. పెంటపాడు మండలంలో 18న చింతపల్లి, కోరుమిల్లి, 19న రాచర్ల, 21న వల్లూరుపల్లి, 22న ఆకుతీగపాడు, బోడపాడు, 23న ముదునూరు, దర్శిపర్రు, 24న యానాలపల్లి, 25న కె.పెంటపాడు 26న జట్లపాలెం, మౌంజీపాడు, 28న పరిమెళ్ళ , 29న రావిపాడు, 30న మీనవల్లూరు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు.

● పాలకొల్లు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :పాలకొల్లు మండలంలో 18న బల్లిపాడు, 22న అరట్లకట్ట, 24న చందపర్రు, 25న గోరింటాడ, 29న తిల్లపూడి, 30న ఆగర్రులో గ్రామ సభలు నిర్వహిస్తామని తహసీల్దార్ దుర్గాకిషోర్ తెలిపారు.

● నరసాపురం రూరల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): గొంది గ్రామంలో రీ సర్వే సదస్సు ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని ఆర్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

● పెనుమంట్ర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : 18న నత్తా రామేశ్వరం, 22న సోమరాజు ఇల్లింద్రపర్రు, 23న వెలగలేరు, 24న జుత్తిగ, 25న మల్లిపూడి, 26న మాముడూరుల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వై. రవికుమార్ తెలిపారు.

● గణపవరం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17: గ్రామాల్లో ఈనెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తామని తహసీల్దార్ అప్పారావు తెలిపారు.

మహనీయుడు వాల్మీకి

▸▸ వాడవాడలా ఘనంగా జయంతి వేడుకలు.. చిత్రపటాల వద్ద నివాళులు



భీమవరం బీవీ రాజు పార్కులో వాల్మీకి జయంతి కార్యక్రమాలు.. తణుకు గ్రంథాలయం ఆవరణలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వావిలాల సరళాదేవి, తదితరులు

భీమవరంటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రామాయణాన్ని సంస్కృతంలో రచించి భారతావనికి అందించిన మహనీయుడు వాల్మీకి అని రిటైర్డ్ సబ్ కలెక్టర్ ఆకుల కృష్ణారావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బీవీ రాజు పార్కులో వాల్మీకి జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. సర్ సీవీ రామన్ స్కూల్ కరస్పాండెంట్ రమణం వేణు గోపాలరావు, రచయిత కలిగొట్ల గోపాలశర్మ, చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వాల్మీకి జీవిత చరిత్రపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయులు జీడిగుంట సునీత, అరసవల్లి సుబ్రహ్మణ్యం, రామాయణం చిన్నారి, కట్టెడ్డి చరణ్ పాల్గొన్నారు.

● పెనుమంట్ర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మార్టేరు వరి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవం నిర్వహించారు. ప్రినిసిపాల్ ఎ.డి.ఆర్. ఇన్‌చార్జి డాక్టర్ పి.రాధిక, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

● భీమవరం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మనగొప్పతనాన్ని నిర్ణయించేది మన కర్మలే అని వాల్మీకి మహర్షి జీవితం మనకు బోధిస్తుందని విశ్రాంత హెచ్‌ఎం ధాయన సురేష్ చంద్రాజీ అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. గ్రంథాలయం అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి వాల్మీకి మహర్షి అని డాక్టర్ వీకేజే ప్రసూన అన్నారు. ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి జయంతి సభ నిర్వహించారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.అరవింద్ స్వామి తదితరులు వాల్మీకి చిత్రపటానికి పుష్పాలంకరణ చేసి భారతీయ విలువలను ఆచరిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కామర్స్ విభాగాధిపతి ఎస్.లక్ష్మీకాంతం, తెలుగుశాఖాధిపతి డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భక్తికి ప్రతిరూపంగా వాల్మీకి తన రామాయణ గ్రంథంలో ఉడుతను రచించాడని డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శోభారాణి అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా కళాశాలలో వాల్మీకి జయంతి నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి రవిశంకర్, అధ్యాపకులు నోబుల్ రాజు, మమత, రేవతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన వాల్మీకి జయంతి నిర్వహించారు. అధ్యాపకులు ఎన్‌వీడీ దినకర్, కె.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● తణుకు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం గ్రంథాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పురుషుల గ్రంథాలయ అభివృద్ధి అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి, వావిలాల శాంతి ప్రసూన, ఎం.జ్యోతి, వి.కరుణ, తదితరులు పాల్గొన్నారు.

● గణపవరం, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17: చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీకాలేజీ గురువారం వాల్మీకి జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి, వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు చైతన్య, వెంకటరమణ, స్వరూపరాణి పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పామరుడి నుంచి పండితుడిగా ఎదిగిన వాల్మీకి ఆదర్శప్రాయుడని ఎంపీడీవో విశ్వనాద్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



టవరెక్కిన లతలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తీగలు లేకుండా ఫోన్‌లను అనుసంధానం చేసే ఆ టవర్ కాలం తీరిన తరువాత పాదుల తీగలే దిక్కయ్యాయి. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో సెల్ టవర్ కాలం చెల్లడంతో ప్రస్తుతం సేవలు అందించలేక పోతున్నాయి. దీంతో ఆ టవర్ చుట్టూ పాదులు అల్లుకుని పైవరకు ఎగబాకాయి. అటుగా వెళ్లేవారికి ఈ దృశ్యం కనువిందు చేస్తోంది.


పడవపై వెళుతూ ఏటిగట్టు పనుల్ని పరిశీలిస్తున్న జేసీ

అభివృద్ధి పనుల పరిశీలన

నరసాపురం, రూరల్, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి): ఏటిగట్టులు, డ్రైనేజీ శాఖల ఆధ్వర్యంలో గత ఏడాది చేపట్టిన పలు అభివృద్ధి పనుల్ని జిల్లా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. గత ఏడాది వరదల సమయంలో బియ్యపుతిప్ప నల్లిక్రిక్ వద్ద గట్టు కోతకు గురైంది. దీన్ని రూ. 12లక్షలతో పటిష్ఠ పనులు చేశారు. ధర్బరేవు డ్రైనేజీలో రూ.23 లక్షలతో పూడిక తీత పనులు, యలమంచిలి మండలంలో రూ.20 లక్షలతో అవుట్‌పాల్స్ స్లూయిస్ పనులు, రూ.7 లక్షలతో నత్తలావ, రుస్తుంబాద డ్రైనేజీల పనులు చేపట్టారు. వీటికి ఇంతవరకు బిల్లులు చెల్లించలేదు. ఈ పనుల్ని ఆయన ఆర్డీవో దాసిరాజుతో కలిసి పరిశీలించారు. వివరాల ను డ్రైనేజీ డీఈ కాశీ విశ్వేశ్వరరావు, ఏటిగట్టుల శాఖ ఏఈ సుబ్బారావును అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్లు రాజరాజేశ్వరి, వై.దుర్గాకిషోర్, ఏఈ పావని, సత్యనారా యణ పాల్గొన్నారు.

మునిసిపల్ డీఈగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు

నరసాపురం, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ డీఈగా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడ కార్పొరేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన డీఈ రమేష్ విజయవాడ బదిలీ అయ్యారు. ఇటు మునిసిపల్ రెండో ఏఈగా పి.దుర్గాకిషోర్ బాధ్యతలు చేపట్టారు. ఆయన కొవ్వూరు పురపాలకం నుంచి బదిలీపై వచ్చారు. ఈస్థానంలో పనిచేసిన సునీల్ రామచంద్రపురం బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఇద్దరిని మునిసిపల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు అభినందించారు.


గొల్లవానితిప్ప గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు


బొండాడ గ్రామంలో సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్, తదితరులు


మాధవరంలో బీటీ రోడ్డు నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

భీమవరం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పల్లె పండుగకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. గొల్లవానితిప్ప, గూట్లపాడు గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.98 లక్షలతో 4 సీసీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గొల్లవానితిప్ప గ్రామంలోని గొంది నుంచి ఎల్‌వీఎన్‌పురం బ్రిడ్జి వరకు రూ.40 లక్షలతో 435 మీటర్ల సీసీ రోడ్డు, మీసేవ సెంటర్ నుంచి లేస్ పార్క్ వరకు రూ.20 లక్షలతో 217 మీటర్ల సీసీ రోడ్డు, గుట్లపాడు గ్రామంలో జే నాగేశ్వరరావు ఇంటి నుంచి రామాయణం బోస్ ఇంటి వరకు రూ.10లక్షలతో 110 మీటర్ల సీసీ రోడ్డు, ముత్యాలమ్మ గుడి దగ్గర నుంచి జేపీ హైస్కూల్ వరకు రూ.28 లక్షలతో 319 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జనసేన మండల అధ్యక్షుడు మోకా శ్రీనివాస్, కౌరు పృధ్వీశంకర్, బొడ్డు మోహన్, చీడే కృష్ణ, కోయలగడ్డ గణపతి, జిత్రిమూర్తులు, పోకల కిషోర్, ఎంపీటీసీ తాతపూడి రాంబాబు, కోళ్ళ అబ్బులు, కారుమూరి సత్యనారాయణమూర్తి, కొప్పర్తి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతితో రాష్ట్రాభివృద్ధి : పితాని

పోడూరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : పల్లెలు ప్రగతితో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరు మండలం పండితవిల్లూరులో గురువారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమం సభలో ఆయన మాట్లాడారు. గ్రామాలభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన రెండు అంగన్‌వాడీ భవనాలను ఆయన ప్రారంభించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక అధ్యక్షత వహించారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి, మండల సర్పంచ్‌ల చాంబర్ మాజీ అధ్యక్షుడు కొరిపల్లి రామచంద్రరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతినీడి రాంబాబు, ఎంపీడీవో బి.మంగాకుమారి, తహసీల్దార్ మహమ్మద్ సయ్యద్ ఫాజిల్, జనసేన మండల అధ్యక్షుడు రావి హరీష్‌బాబు, ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన రహదారి నిర్మాణానికి భూమి పూజ

కాళ్ళ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బొండాడ గ్రామంలో శ్మశాన రహదారి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బొండాడ గ్రామంలో సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. గ్రామ సర్పంచ్ మన్నే నాగరాజు, మండపాటి కృష్ణమూర్తి, మేక వెంకన్నబాబు, పణి, గొర్ల లక్ష్మణ్, తేజ, శివాజీ, నాని తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం : ఆరిమిల్లి

తణుకు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : వార్డులో సమస్యలు పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పలు శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. పట్టణంలోని 29వ వార్డులో గురువారం గ్రామదర్శిని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలడిగి తెలుసుకుంటున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్. తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మతో పాటు కూటమి నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, కలగర వెంకటకృష్ణ, కాకిలేటి హరినాథ్, తమరాపు రమణమ్మ, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, తాతపూడి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు

ప్రతి ఇంటికీ పెద్దకుడుకులా తోడుంటా

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికీ తాను పెద్ద కొడుకులా అందరి కష్టసుఖాల్లో తోడుంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పల్లె పండుగలో భాగంగా మాధవరంలో బీటీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, ఉపసర్పంచ్ బండారు నాగరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో గొంతాలమ్మ పండుగ

మండలంలోని కొమ్ముగూడెం గొంతాలమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని సర్పంచ్ తాడేపల్లి బేబి ఆధ్వర్యంలో ఈ పండుగ నిర్వహించారు. అమ్మవారిని అంగరంగ వైభవంగా ఊరేగించారు. అమ్మవారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జీ, నాయకులు పట్టికూటి అబ్బు, తాడేపల్లి శ్రీను, అబ్బిన గోపాలకృష్ణ తదితరులు దర్శించుకున్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణమూర్తి

సనాతన ధర్మంపై చర్చాగోష్టి

తణుకు, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి) :సనాతన ధర్మం రాజ్యాంగానికి, ప్రజాస్వామిక స్ఫూర్తికి గొడ్డలి పెట్టు వంటిదని చరిత్ర ఉపాధ్యాయులు, ప్రముఖ కవి విశ్లేషకులు కె.వెంకటరమణమూర్తి అన్నారు. సురాజ్య భవనంలో గురువారం రాజ్యాంగం-సనాతన ధర్మంపై పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చర్చాగోష్టి నిర్వహించారు. దారిదీపం ప్రధాన సంపాదకులు డీవీవీఎస్ వర్మ అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు సంకు మనోరమ, సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు పేరూరి మురళీ కుమార్, సీపీఎం కార్యదర్శి పీవీ ప్రతాప్‌కుమార్, తణుకు సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.



ఉండి సెంటర్‌లో కురుస్తున్న వర్షం.. గొరగనమూడిలో కూలిన ఇంటి పైకప్పు పెంకులు

భారీ వర్షం.. ముందుకొచ్చిన సముద్రం

5వ పేజీ తరువాయి..

రోడ్డు వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకివీడు పట్టణంలో రహదారులు కాల్వలు, చెరువులను తలపించాయి. డ్రెయిన్లు ఆక్రమణలకు గురై పూడుకుపోవడంతో పారుదల క్షీణించి వర్షపు నీరు రోడ్లపైనే నిలిచింది. పాదచారులు, వాహనదారులు త్రీవ ఇబ్బందులు పడ్డారు. పాలకోడేరు మండలం గొరగనమూడి పెదపేటలో ఇటీవల కురిసిన వర్షాలకు బుధవారం రాత్రి ఇంటి పైకప్పు కూలిపోయింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. గత కొన్నిరోజులుగా వర్షాలు కురవడంతోనే ఇంటి పై కప్పు ఉన్న చెక్కలు నానిపోవడంతో ప్రమాదం ఏర్పడిందని తులసే ప్రదీప్‌కుమార్ భార్య ధనలక్ష్మి చెప్పారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు. పాలకొల్లు పట్టణంలో విడతల వారీగా పలుమార్లు వర్షం కురిసింది. ఉదయం సమయంలో కురడంతో మార్కెట్‌కు వెళ్ళిన వారు ఉద్యోగులు, ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. సాయంత్రం సుమారు మూడు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ కార్యాలయానికి ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తే నాథుడు లేడు. అధికారులు స్పందించకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

శ్రీకృష్ణ దేవరాయులు రాజ్యపాలన మహోన్నతం

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్నాటక రాష్ట్ర ప్రజల అభిమాన పాత్రుడు శ్రీకృష్ణ దేవరాయులు రాజ్యపాలన మహోన్నతంగా సాగిందని వక్తలు అన్నారు. ఈసందర్భంగా తెలుగు వైభవాన్ని గుర్తించిన దేవరాయులు తెలుగు వారికి అత్యంత ప్రీతిపాత్రుడుగా చరిత్రలో నిలిచి ఉన్నారన్నారు. శ్రీకృష్ణదేవరాయులు 495వ వర్ధంతి సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయులు సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక కెనాల్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 1509 నుంచి 1529 వరకు దక్షిణ భారతదేశంలో విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన గొప్ప చక్రవర్తిగా నిలిచి ఉంటారన్నారు. అనంతరం విశ్వమానవ వేదిక ఆధ్వర్యంలోని వృద్ధుల ఆశ్రమంలో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం, మండెల రజనీ, ఇనుకొండ శేషాద్రి, రాయి సూరిబాబు, బోనం చినబాబు, వైరతన్, గుండుమోగుల వీరాస్వామి, సద్దిరెడ్డి వెంకటరత్నం, జొన్నల రామారావు, బాబి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఆచంట/పెనుగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోడూరు మండలం ఆచంట, వల్లూరు, పోడూరు, కొమ్ముచిక్కాల సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ కె.మధు కుమార్ తెలిపారు. పెనుగొండ మండలం పెనుగొండ, వడలి, కొఠాలపర్రు, సోమరాజు చెరువు, సిద్ధాంతం, ఇలపర్రు, ములపర్రు, తామరాడ, రామన్నపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తామని ఈఈ తెలిపారు.

ఆధ్యాత్మికం

కనక దుర్గమ్మ గ్రామోత్సవం



భీమవరంలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న సీతారామలక్ష్మి, మెంటేవారితోటలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరంటౌన్/ భీమవరం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భీమవరం నామవారి సెంటర్‌లో వున్న కనకదుర్గమ్మ అమ్మవారి వార్షిక మహోత్స వం ముగింపులో భాగంగా గురువారం అమ్మవారి జాతర మహోత్సవాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఒంటెద్దు బళ్ళ సంఘం ఆధ్వ ర్యంలో అమ్మ వారిని ఊరేగించారు. గునుపూడిలో వున్న ఆదిలక్ష్మీ, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ దసరా మహోత్సవ నవరాత్రుల సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. ఆలయ ఈవో గొట్టుముక్కల నాగసీతారామరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మెంటేవారి తోటలోని బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా అన్నసమారాధన కార్యక్ర మాన్ని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ప్రారంభించారు. గ్రంధి రవితేజ, తోట బో గయ్య, నందమూరి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

● పాలకోడేరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు గ్రామంలోని పంట కాల్వ వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వద్ద గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు.

వడలి గ్రామంలో..

పెనుగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వడలి గ్రామంలో గొంతేలమ్మ గ్రామోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సంబరాలు నెలరోజుల పాటు పూజలు నిర్వహించి అట్లతద్ది ముందు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. వడ్డి ఉదయ కిరణ్, ఉటాల రాజశేఖర్, మాతా సురేంద్ర, జనిపెళ్ళ వీర, గుమ్మడి బాలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● ఆచంట, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : కొడమంచిలి శివారు తురకవాని మెరకలో గురువారం గొంతేనమ్మ పండుగ వేడుకగా నిర్వహించారు. పుట్టమట్టితో గొంతేనమ్మను తయారు చేసి అలంకరించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అనేక మంది భక్తులు దర్శించుకోగా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


సోమేశ్వరస్వామి ఆలయంలో హుండీల సొమ్మును లెక్కిస్తున్న భక్తులు

సోమేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.7.53 లక్షలు

భీమవరంటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : గునుపూడి సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానంలో గురువారం రూ7,53,338 లక్షలు ఆదాయం వచ్చిందని ఈవో ఎం.రామకృష్ణంరాజు తెలిపారు. 124 రోజులకు సంబందించి "హుండీల సొమ్మును గురువారం లెక్కించామన్నారు. బంగారం 11 గ్రాముల, 400 మిల్లీగ్రాములు, వెండి 275 గ్రాముల 100 మిల్లీ గ్రాములు, విదేశీ నగదు పది నోట్లు రాగా కెనడా, సింగపూర్, అమెరికా డాలరు నోట్లు, ఖతార్ రియల్స్ నోటు వచ్చాయని వివరించారు. లెక్కింపును దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు పర్యవేక్షించారని తెలిపారు.